సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 27 । ఆగస్టు । 2025



పవిత్ర మేడమ్ స్ఫూర్తితో..
పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ జీవశాస్త్ర టీచర్ పవిత్ర చదువుచెప్పిన ఎంతోమంది ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. - 10లో



విహారం కావొద్దు విషాదం
సాగర్ అందాలను చూసేందుకు వస్తున్న పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. - 10లో



మేకల చోరీ ముఠా అరెస్ట్
మేకలు చోరీ చేస్తున్న 16 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. - 10లో

• మట్టి వినాయకుడిని పూజిద్దాం



భువనగిరిటౌన్ : వినాయక చవితిని పురస్కరించుకుని భువనగిరి పట్టణంలో మంగళవారం మట్టి గణనాథుడి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్‌చిస్తీ

• ఓం గణేశాయ నమః



చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని ప్రైవేట్ స్కూల్‌లో వినాయకుడి ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 80962 93702

న్యూస్‌రీల్

రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

మోత్కూరు : మోత్కూరు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బుంగ చరణ్ రాజ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి విచారణ చేసి బాధిత రైతుల నుంచి వాంగ్మూలం సేకరించారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. ఈమేరకు రికార్డు అసిస్టెంట్ చరణ్‌రాజ్ అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో కలెక్టర్ అతడిని సస్పెండ్ చేశారు. వసూళ్లకు పాల్పడిన రికార్డు అసిస్టెంట్ నుంచి రూ.1800 రికవరీ చేసి బాధిత రైతులు గంట శ్రీనివాస్‌రెడ్డి, బాసోజు అంజయ్యచారికి అందజేశామని తహసీల్దార్ జ్యోతి విలేకరులకు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్‌ను రాజాపేటకు డిప్యుటేషన్‌పై పంపిస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజాపేటలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లును మోత్కూరుకు నియమించారు.

ముగిసిన పదోన్నతుల ప్రక్రియ

భువనగిరి: ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మంగళవారం ముగిసింది. జిల్లాలో 1:1 ప్రకారం మొత్తం 100 ఖాళీల పోస్టులకు ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, పీఎస్ హెచ్ఎంలుగా పదోన్నతుల కోసం ఈ నెల 25న వెబ్ ఆప్షన్ పెట్టుకున్నారు. 96 పోస్టులు జిల్లా పరిషత్ పాఠశాలల్లో ఉండగా.. నాలుగు పోస్టులు ఉన్నత పాఠశాలల్లో ఉన్నాయి. పదోన్నతులు పొందిన వారికి మంగళవారం విద్యాశాఖ అధికారులు ఆర్డర్లు జారీ చేశారు. వీరు 15 రోజుల్లో నిర్ణీత పాఠశాలలో చేరాల్సి ఉంటుంది.

ముగ్గురి పదోన్నతులు నిలిపివేత

ఈ ప్రక్రియలో ముగ్గురికి పదోన్నతులు నిలిపివేశారు. ఇందులో ఒకటి పీఎస్‌హెచ్‌ఎం పోస్టు కాగా రెండు స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు ఉన్నాయి. ఎస్సీ కేటగిరిలో ఇద్దరు ఉండటంతో ఆ పోస్టును మహిళకు కేటాయించాలని కోరడం, రెండోది అర్హత లేని వారికి పదోన్నతి కల్పించే విషయం, మూడోది సస్పెండ్‌కు గురైన ఉపాధ్యాయుడికి పదోన్నతి కల్పించడంతో ఈ మూడు పోస్టులను నిలిపివేశారు.

పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి



కలెక్టర్‌ను కలిసిన మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మోతి

భువనగిరిటౌన్ : మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మోతి మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలిసారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ డైరెక్టర్ మోతి పాల్గొని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా చూడాలన్నారు. అనంతరం జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. బాల సదనం సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, సీడీపీఓ విజయలక్ష్మి, అనంతలక్ష్మి ఉన్నారు.

వినాయకా.. పదవులెవరికి?

- గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగిసేలోపు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని అధిష్టానం నిర్ణయం
- ముందుగా కార్పొరేషన్ డైరెక్టర్ పోస్టులు భర్తీ
- సామాజిక వర్గ సమీకరణకు పెద్దపీట
- నేతల్లో చిగురిస్తున్న ఆశలు
- ఇప్పటికే జాబితాను పీసీసీకి పంపించిన ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షుడు



సాక్షి, యాదాద్రి : గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగిసే లోపు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. దీంతో జిల్లాలోని నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. నామినేటెడ్ పదవులు భర్తీ చేయాలని నిర్ణయించడంతో ఆశావాహులు పదవి దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు డీసీసీ అధ్యక్షుడు రూపొందించిన జాబితా అధిష్టానం వద్దకు చేరింది.

సామాజిక వర్గాల వారీగా పీసీసీకి చేరిన జాబితా

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సామాజికవర్గ సమీకరణకు పెద్దపీట వేశారు. బీసీ, ఎస్సీ సామాజికవర్గాల వారీగా ఆశావాహుల పేర్లను పీసీసీకి పంపించారు. స్థానిక ఎమ్మెల్యేల నుంచి ఈ పేర్లు స్వీకరించారు. అయితే డీసీసీ అధ్యక్షుల ద్వారా పీసీసీకి చేరిన జాబితాపై పార్టీ అధిష్టానం క్రాస్ చెక్ చేసింది. ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ గత నెల భువనగిరికి వచ్చిన సమయంలో జాబితాపై విచారణ చేశారు. అర్హులకు ఇచ్చారా.. పార్టీ విధేయులేనా.. గత ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేశారా.. ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చారా అని విచారణ చేశారు. పార్టీ కేడర్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నారు.

ముందుగా డైరెక్టర్ల పదవుల భర్తీ

నామినేటెడ్ పదవుల్లో ముందుగా కార్పొరేషన్ డైరెక్టర్ల పదవులను భర్తీ చేయనున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి, డైరెక్టర్ల పదవులను పెండింగ్‌లో ఉంచింది. అయితే చైర్మన్లు ఉన్న ప్రతి కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న డైరెక్టర్ల పదవులను ముందుగా భర్తీ చేయాలని నిర్ణయించింది. అయితే నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న కాంగ్రెస్ నాయకులు వారం పదిరోజుల్లో శుభవార్త వింటారని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు చెప్పారు.

నియోజకవర్గానికి రెండు పదవులు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండేసి పదవుల చొప్పున ఇవ్వనున్నారు. ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు చోట్ల నామినేటెడ్ పదవుల కోసం పేర్లు అధిష్టానానికి పంపించారు. పార్టీలో అంతర్గత విచారణ కూడా పూర్తయింది. దాదాపు ఆయా అభ్యర్థులకు డైరెక్టర్ల పదవులు వరించబోతున్నాయి.

కార్పొరేషన్ చైర్మన్లు సైతం

పార్టీ అధిష్టానం ఆలోచన మేరకు నామినేటెడ్ పదవుల్లో ప్రధానమైన కార్పొరేషన్ చైర్మన్ పదవులు భర్తీ చేయనున్నారు. డైరెక్టర్ల పదవులు భర్తీ కాగానే ఈ ప్రక్రియ జరగనుందని సమాచారం. ఎమ్మెల్యేలు, జిల్లాకు చెందిన మంత్రులు, సీఎం స్థాయిలో కార్పొరేషన్ చైర్మన్ ఎంపికకు ఇప్పటికే కసరత్తు జరుగుతోంది. పీసీసీ, సీఎం స్థాయిలో ఎంపిక చేసిన వారి వివరాలను ఏఐసీసీకి పంపిస్తారు. అక్కడ ఆమోదం తెలిపిన తర్వాత పదవుల పందేరం జరగనుంది. జిల్లా నుంచి నాలుగైదు పేర్లు కార్పొరేషన్ చైర్మన్ పదవి రేసులో ఉన్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడొకరు చెప్పారు.

రావయ్యా.. గణపయ్య

- నేడు కొలువుదీరనున్న గణనాథులు
- మండపాలను సిద్ధం చేసిన నిర్వాహకులు
- జిల్లా వ్యాప్తంగా సుమారు 5వేల వినాయక విగ్రహాలు ఏర్పాటు



యాదగిరిగుట్ట పట్టణంలోని వైకుంఠద్వారం వద్ద వినాయక మండపాన్ని సిద్ధం చేస్తున్న యువకులు

భువనగిరి: జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం నిర్వహకులు వినాయక మండపాలను సిద్ధం చేశారు. జిల్లాలో సుమారు 5వేల వినాయక విగ్రహాలు కొలువుదీరనున్నాయి.

మట్టి విగ్రహాల ఏర్పాటుకు ప్రాధాన్యత

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ శాఖల అధికారుతో పాటు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఏర్పాటు కానున్న సుమారు 5వేల వినాయక విగ్రహాల్లో సుమారు 2వేల వరకు మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.

కిటకిటలాడిన కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ఇప్పటికే భారీ గణనాథుడి విగ్రహాలను హైదరాబాద్‌లో కొనుగోలు చేసి గత నాలుగు రోజుల నుంచి తమ ప్రాంతాలకు తరలిస్తున్నారు. వీరితో పాటు జిల్లాలో భువనగిరి, చౌటుప్పల్, వలిగొండ, యాదగిరిగుట్ట, ఆలేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల కేంద్రాల వద్ద కొనుగోలు దారులతో సందడి వాతావరణం నెలకొంది. వినాయక విగ్రహాలతో పాటు పూజా సామగ్రి, పండ్ల కొనుగోళ్లతో ఆయా కేంద్రాలు కిటకిటలాడాయి.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం



గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే అన్ని వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశాం. ఈ నెల 7న గ్రహణం ఉన్నందున ఆలోపు నిమజ్జనాలు చేసుకుంటే బాగుంటుందని పండితులు సూచించారు. ఆమేరకు నిర్వహించేలా మండపాల నిర్వాహకులకు సూచనలు చేశాం.

– రత్నపురం శ్రీశైలం, భువనగిరి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు

పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



దండుమల్కాపురం గ్రామంలోని చెరువు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ అక్షాంశ్ యాదవ్

చౌటుప్పల్ రూరల్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని యాదాద్రి భువనగిరి డీసీపీ అక్షాంశ్ యాదవ్ కోరారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం, పెద్దకొండూర్ చెరువుల వద్ద గణేష్ నిమజ్జనానికి చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్, తహసీల్దార్ వీరాబాయి, ఎస్సై ఉపేందర్‌రెడ్డి, ఆర్‌ఐ బాణాల రాంరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి ఉన్నారు.

డిగ్రీ కాలేజీకి జూనియర్ కళాశాల తరలింపు

సాక్షి ఎఫెక్ట్..

ఆలేరు: ఆలేరు జూనియర్ కళాశాల భవనం శిథిలమై గదుల పైకప్పుల పెచ్చులూడుతుండటంతో 'ప్రమాదమని తెలుసు.. ఎందుకో అలుసు' శీర్షికన ఈనెల 4న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం ఉన్నతాధికారులను కదిలించింది. అదేరోజు కలెక్టర్ హనుమంతరావు స్పందించారు. ఈ విషయమై నివేదిక ఇవ్వాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖఅధికారి(డీఐఈఓ) రమణిని ఆదేశించారు. ఈనెల 5న డీఐఈఓ కళాశాలను సందర్శించి కలెక్టర్‌తోపాటు ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్యకు నివేదిక అందజేశారు. అనంతరం ఇంటర్ బోర్డు కమిషనర్ రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ దేవసేనకు కళాశాల పరిస్థితిని వివరించారు. ఆలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోకి జూనియర్ కళాశాలను తరలించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన దేవసేన డిగ్రీ కళాశాలకు జూనియర్ కళాశాలను తరలించేందుకు అనుమతి ఇస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జూనియర్ కళాశాలను అధికారులు షిఫ్ట్ చేశారు. సోమవారం నుంచి డిగ్రీ కళాశాలలో జూనియర్ కళాశాల తరగతులు ప్రారంభించారు. ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చొరవ చూపిన సాక్షి దినపత్రికకు విద్యార్థులు, అధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు. డిగ్రీ కళాశాలలో మొత్తం ఏడు గదులను తమకు కేటాయించినట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పూజారి వెంకటేశ్వర్లు చెప్పారు. ఉదయం 8గంటల నుంచి ఒంటి గంట వరకు జూనియర్ కళాశాల తరగతులు, ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు డిగ్రీ కళాశాల తరగతులు సాగుతాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజారామ్ తెలిపారు.

బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు సాంకేతిక పరికరాల అందజేత

భువనగిరిటౌన్ : చేయూత పింఛన్ల పంపిణీ మరింత మెరుగ్గా జరిగేందుకు జిల్లాలోని బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లకు కొత్త మొబైల్ ఫోన్లు, ఫింగర్ ప్రింట్ డివైస్‌లు ఇతర సాంకేతిక పరికరాలను కలెక్టరేట్ లో కలెక్టర్ హనుమంత రావు మంగళవారం పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 229 సెట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, పెన్షన్ ఏపీఎం శ్రీనివాస్ మాస్టర్స్ పాల్గొన్నారు.

63 ఏళ్లుగా నవరాత్రోత్సవాలు

- యాదగిరిగుట్టలోని హనుమాన్ వీధిలో 1962కు ముందు నుంచే గణేష్ ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని గాంధీనగర్‌కు వెళ్లే దారిలో వైకుంఠద్వారం సమీపంలో ఉన్న హనుమాన్ వీధిలో కాలనీవాసులు 63ఏళ్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా కాలనీలో ఉండే ప్రజలంతా కమిటీ ఏర్పాటు చేసుకొని నవరాత్రులను వైభవంగా జరిపిస్తూ ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుతున్నారు.

కాలనీ అంతా ఏకమై..

యాదగిరిగుట్ట పట్టణంలోని హనుమాన్ వీధిలో ఉన్న హనుమాన్ ఆలయం వద్ద మొదట్లో ఐదారు కుటుంబాలు మండపాన్ని ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు నిర్వహించేవారు. అప్పట్లో సుమారు 3 ఫీట్ల వినాయకుడి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇక్కడ తొమ్మిది రోజుల పాటు యాదగిరిగుట్ట ఆలయ అర్చకులతో పూజలు నిర్వహించేవారు. ప్రస్తుతం కాలనీ అంతా ఏకమై ఒకే చోట మండపాన్ని ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.



1980లో వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం


ప్రత్యేక కమిటీగా ఏర్పడి పూజలు జరిపిస్తాం

నా చిన్ననాటి నుంచే హనుమాన్ ఆలయం వద్ద వినాయక మండపం ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నారు. మా కాలనీ ప్రజలంతా కమిటీగా ఏర్పడి పూజలు జరిపిస్తాం. మా పెద్దలు ఏ విధంగానైతే పూజల బాధ్యత మా పై పెట్టారో.. అలాగే మా పిల్లలకు నేర్పిస్తున్నాం.

– శ్రీధర్‌రెడ్డి, నిర్వాహకుడు

పంచాయతీ పోరుకు సిద్ధం!

- 28న ఓటర్ల, పోలింగ్‌కేంద్రాల ముసాయిదా జాబితా విడుదల
- వచ్చే నెల 2న తుది జాబితా ప్రకటన



సాక్షి, యాదాద్రి : రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేసింది. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌ల వారీగా విడుదల చేయాలని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు గురువారం గ్రామ పంచాయతీల్లో ముసాయిదా జాబితాను ప్రకటించడానికి జిల్లా పంచాయతీ అధికారులు ఏర్పాట్లు ప్రారంభించారు. జిల్లాలోని 17 మండలాల్లోని 427 గ్రామ పంచాయతీల్లో 532218 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 2,64,567 మంది పురుషులు, 2,67,649 మంది స్త్రీలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. పోలింగ్ స్టేషన్‌లు 3,704 ఉన్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. తొలి విడతలో 10 మండలాలు, 220 గ్రామ పంచాయతీలు, 1876 వార్డులు, రెండో విడతలో ఏడు మండలాలు, 207 గ్రామ పంచాయతీలు, 1828 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ఓటర్ల, పోలింగ్‌కేంద్రాల ముసాయిదా జాబితా

గ్రామ పంచాయతీల్లో ప్రకటించే ముసాయిదాపై అభ్యంతరాలను, సలహాలను అధికారులు స్వీకరిస్తారు. ఇందుకోసం రాజకీయ పార్టీలకు జిల్లా స్థాయి, మండల స్థాయిలో అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ద్వారా వివరిస్తారు. ఓటర్లు, రాజకీయ పార్టీలనుంచి వచ్చిన ఫిర్యాదులు, సలహాలను ఈనెల 31న పరిష్కరిస్తారు. అనంతరం వచ్చేనెల 2న తుది జాబితాను విడుదల చేస్తారు.

ఓటరు, పోలింగ్ కేంద్రాల ముసాయిదా ఇలా..

28న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రచురణ
29న రాజకీయ పార్టీలతో సమావేశం
30న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం
28 నుంచి 30 వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
31న అభ్యంతరాల పరిష్కారం వచ్చేనెల 2న తుది జాబితా ప్రకటన

వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం

అసెంబ్లీ ఓటరు జాబితా ఆధారంగా గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఓటరు జాబితాను జిల్లా పంచాయతీ అధికారులు రూపొందించారు. జనవరి 1న ప్రకటించిన సాధారణ ఎన్నికల జాబితాకు అదనంగా జూలై 7 వరకు వచ్చిన నూతన ఓటర్ల చేరికను కూడా పరిగణలోకి తీసుకున్నారు. ఒకే వార్డు ప్రజలు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండే విధంగా ఓటరు జాబితాలను సిద్ధం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలి

- కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం భువనగిరి మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణ పనులను బట్టి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని చెప్పారు.

పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలి

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అంతకు ముందు గ్రామంలో మెడికల్ క్యాంపుల నిర్వహణ, సీజనల్ వ్యాధుల వ్యాప్తి గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే గర్భిణులు ప్రసవాలు చేయించుకోవాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అమ్మకు భరోసా కార్యక్రమంలో భాగంగా భువనగిరి మండలంలోని రెడ్డి నాయక్ తండాలో పల్లవి అనే గర్భిణి ఇంటికి వెళ్లారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పోష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆమెకు పండ్లు అందజేశారు.

కిక్కిరిసిన ఎయిమ్స్

బీబీనగర్: బీబీనగర్‌లోని ఎయిమ్స్‌లో మంగళవారం రద్దీ ఏర్పడింది. ఓపీ విభాగం వద్ద జనం పెద్దఎత్తున బారులుదీరారు. ఎయిమ్స్‌లోని వైద్య విభాగాలు రోజు రోజుకు పెరుగుతుండడంతో రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. రోజుకు 2000లకు పైగా ఓపీ ద్వారా ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారు. కానీ ఓపీ కౌంటర్లు 10మాత్రమే ఉన్నాయి. రోగులకు అనుగుణంగా కౌంటర్ల సంఖ్య లేకపోవడంతో ఓపీ కార్డు పొందేందుకు గంటల తరబడి క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, ఓపీ కౌంటర్ల సంఖ్య పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



ఎయిమ్స్‌లో ఓపీ కౌంటర్ల వద్ద జనం రద్దీ

క్లుప్తంగా

వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి


బాలరాజు (ఫైల్)

గుండాల: ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గుండాల మండలం అంబాల గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం రామచంద్రగూడెం గ్రామానికి చెందిన చిర్ర బాలరాజు(55) కొంత కాలంగా హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్‌లో ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య గతంలోనే మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బాలరాజు తన అత్తగారి ఊరైన ఆత్మకూరు(ఎం) మండలం పారుపల్లి గ్రామంలో మైసమ్మ పండుగకు హాజరయ్యేందుకు ఆదివారం హైదరాబాద్ నుంచి బస్సులో బయల్దేరి మోత్కూరులో దిగాడు. అక్కడి నుంచి పారుపల్లి గ్రామంలోని తన అత్తగారి వ్యవసాయ బావి వద్దకు వెళ్లేందుకు ఆత్మకూరు(ఎం) మండలం మోదుబావిగూడెం, గుండాల మండలం అంబాల గ్రామ శివారులోని బిక్కేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యాంపై నడుచుకుంటూ వెళ్తుండగా.. ప్రమాదవశాత్తు వాగులో జారిపడి కొట్టుకుపోయాడు. మంగళవారం అంబాల గ్రామ శివారులో బిక్కేరు వాగు ఒడ్డున బాలరాజు మృతదేహాన్ని స్థానిక రైతులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు నర్సింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తేజమ్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

నాగారం: కుక్కల దాడిలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో మంగళవారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫణిగిరి గ్రామానికి చెందిన షేక్ షఫీ స్థానిక మేరీ మదర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో తుంగతుర్తికి చెందిన జటంగి సతీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం అటెండర్ షఫీ పాఠశాల వెనుక ఉన్న గదిలోకి వెళ్లగా.. అక్కడ కుక్కలు ఉండడంతో వాటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించాడు. దీంతో ఒక్కసారిగా కుక్కలు అతడిపై దాడి చేసి తొడ భాగంలో కరిచాయి. అతడు కేకలు వేయగా సమీపంలో ఉన్న ఉపాధ్యాయుడు సతీష్ వచ్చి షఫీని విడిపించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో కుక్కలు సతీష్‌పై కూడా దాడి చేసి ఛాతి భాగంలో గాయపరిచాయి. గ్రామంలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, అధికారులు స్పందించి వాటిని ఊరికి దూరంగా తరిమేయాలని స్థానికులు కోరుతున్నారు.

విహారం కావొద్దు విషాదం

- సాగర్ సందర్శనకు వచ్చేవారు అప్రమత్తంగా ఉండాలని సూచన
- జలాశయంలోకి దిగొద్దని హెచ్చరిక
- సూచిక బోర్డులు, ట్రెంచ్‌ల ఏర్పాటు


సాగర్ జలాశయ తీరంలో యువత


దయ్యాలగండి పుష్కరఘాట్ వద్ద పర్యాటకులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతుండడంతో సాగర్ అందాలను చూసేందుకు పర్యాటకులు, యువత భారీగా తరలివస్తున్నారు. ఈ క్రమంలో కొందరు సాగర్ పరిసర ప్రాంతాల్లో, దయ్యాలగండి పుష్కర ఘాట్ వద్ద జలాశయంలోకి దిగడం వంటివి చేస్తున్నారు. అదేవిధంగా సెల్ఫీలు, ఫొటోలు తీసుకునే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక్కసారిగా కాలు జారి నీటిలో పడితే బయటకు రావడం కష్టమని రక్షణ సిబ్బంది చెబుతున్నారు. గతంలో పలువురు యువకులు నీటిలో ఈత కొడుతూ, ఫొటోలు దిగుతూ ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల సోషల్ మీడియాలో షార్ట్ వీడియోలు, సెల్ఫీలు ట్రెండ్ అవుతున్న నేపథ్యంలో యువత జలాశయం నీటిలో దూకుతూ, లోతైన ప్రదేశాల్లో ఈత కొడుతూ వీడియోలు తీసుకుని వాటిని సోషల్ మీడియాలో పెట్టడం ఫ్యాషన్‌గా మారింది. అనుకోని ఘటన జరిగితే ప్రాణాలనే ప్రమాదమని గుర్తించాలని స్థానికులు, అధికారులు సూచిస్తున్నారు.

అధికారుల ఏర్పాట్లు..

పర్యాటకుల భద్రత కోసం సాగర్ తీరం వెంట అధికారులు, పోలీసులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దయ్యాలగండి వద్ద గల పుష్కర ఘాట్ వద్దకు వెళ్లకుండా రోడ్డు వెంట లోతైన ట్రంచ్ కొట్టారు. కొన్ని చోట్ల పోలీసులు క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు ఆ సూచనలను పట్టించుకోవడం లేదని అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీకి యత్నం

మునుగోడు: మునుగోడు మండలం చొల్లేడు గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి యత్నించారు. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లగూడెం గ్రామానికి చెందిన మద్ది మల్లేష్ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లగా.. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి చోరీకి యత్నించారు. కానీ ఇంట్లోకి వెళ్లకుండానే తిరిగి వెళ్లిపోయారు. మల్లేష్ కుటుంబ సభ్యులు ఇంటి వచ్చేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు మల్లేష్ తెలిపాడు.

బ్యాంకులో లోన్ చెల్లిస్తున్న వ్యక్తి నుంచి నగదు చోరీ

నకిరేకల్: బ్యాంకులో గోల్డ్ లోన్ చెల్లించేందుకు వచ్చిన వ్యక్తి నుంచి గుర్తుతెలియని మహిళలు డబ్బులు చోరీ చేశారు. ఈ ఘటన నకిరేకల్‌లోని సహకార కోపరేటివ్ బ్యాంక్‌లో సోమవారం మధ్యాహ్నం జరిగింది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలం నడిగూడెం గ్రామానికి చెందిన నాగరాజు నకిరేకల్‌లోని కోపరేటివ్ సహకార బ్యాంక్‌లో గోల్డ్ లోన్ తీసుకున్నాడు. లోన్ చెల్లించేందుకు సోమవారం మధ్యాహ్నం బ్యాంక్‌కు వచ్చాడు. రూ.3లక్షలు బ్యాంకు కౌంటర్‌లో చెల్లిస్తుండగా గుర్తుతెలియని మహిళలు అతని చుట్టూ చేరారు. ఈ క్రమంలో నాగరాజుకు ఫోన్ రావడంతో పక్కకు జరిగి ఫోన్ మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన నలుగురు మహిళలు కౌంటర్ దగ్గర నాగరాజుకు చెందిన రూ2.50లక్షల అపహరించి పరారయ్యారు. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు


మాట్లాడుతున్న ఈశ్వరరావు

కోదాడ: కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పకొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. ఈశ్వరరావు కోరారు. మంగళవారం కోదాడలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటి వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ సంస్థలకు అమ్ముతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా కార్మికులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 29న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ల ముందు జరిగే ధర్నాలను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, రాధాకృష్ణ, శ్రీలం శ్రీను, చెరుకు ఏకలక్ష్మి, సోమయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బొలేరో వాహనం ఢీకొని బాలిక మృతి


అక్షర (ఫైల్)

కొండమల్లేపల్లి: బొలేరో వాహనం ఢీకొని బాలిక మృతి చెందింది. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం కొల్‌ముంతల్‌పహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్ వద్ద మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొల్‌ముంతలపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీనగర్‌కి చెందిన పీట్ల రాజు, సంధ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. రాజు కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం బాపూజీనగర్‌కు వచ్చారు. మంగళవారం ఉదయం రాజు కుమార్తె అక్షర(4) తన నానయమ్మ సుగుణమ్మతో కలిసి బాపూజీనగర్‌లో రోడ్డు దాటుతుండగా.. దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపు వేగంగా వస్తున్న బొలేరో వాహనం అక్షరను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అక్షరను చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

మట్టపల్లిలో గరుడ వాహన సేవ


గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాయలంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని సోమవారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీసామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూ వరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యా హవచనం, రుత్విగ్వరణం , పంచగవ్య ప్రాశన, మధుపర్క పూజ , మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి అమ్మవార్లను ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కాగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయ స్వామికి నాగవల్లి దళాలతో ప్రత్యేక అర్చనలు చేశారు. ఆ తర్వాత మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయా చార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, కంబాల మురళినాయుడు పాల్గొన్నారు.

మేకలు అపహరిస్తున్న ముఠా అరెస్ట్

- రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, పోలీస్ అధికారులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

నల్లగొండ: రాత్రి వేళ కార్లలో మేకలు అపహరిస్తున్న 16 మంది ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం రాత్రి శాలిగౌరారం సమీపంలోని బైరవోని బండ ఎక్స్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. అటుగా కారులో వచ్చిన వారు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు కారును వెంబడించి పట్టుకున్నారు. కారులో అనుముల మండలం అలీనగర్‌కు చెందిన సంపంగి వెంకటేష్, సంపంగి శారద, మునుగోడు మండలం గూడపూర్‌కు చెందిన వేంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిడమనూరుకు చెందిన దాసర్ల వినోద్‌కుమార్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి ఫింగర్ ప్రింట్స్ స్కాన్ చేయగా వారిపై గతంలో మేకలు చోరీ చేసిన కేసు ఉన్నట్లు తేలింది. పట్టుబడిన నలుగురిని విచారించి.. వారితో పాటు మేకలు చోరీ చేస్తున్న మర్రిగూడ మండలం శివన్నగూడేనికి చెందిన వరికుప్పల రవి, రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌కు చెందిన గండికోట శివకుమార్, ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల మండలం ఎస్సీ కాలనీకి చెందిన అమ్ములూరి విజయ్, హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన లింగాల అశోక్, ఉండం కళ్యాణి, భువనగిరి హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన వల్లెపు ప్రసాద్, మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం పెద్దాయిపల్లికి చెందిన మద్యాల సహదేవ్, సూర్యాపేట జిల్లా మోతెకు చెందిన కోడిసె వంశీకృష్ణ, కంపాటి హుస్సేన్, కంపాటి అజయ్‌కుమార్, మట్టి సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. వీరంతా కలిసి నాలుగు ముఠాలుగా ఏర్పడి కార్లలో పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రి వేళ మేకలను కార్లలో వేసుకొని చోరీలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. వీరు నల్లగొండ జిల్లాలో 15 చోట్ల, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్లతో పాటు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల పరిధిలో 10 చోట్ల మేకలు అపహరించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. దొంగలించిన మేకలను సంతలలో గుర్తుతెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారని ఎస్పీ వివరించారు. వారి నుంచి రూ.2.46లక్షల నగదు, 22 గొర్రెలు, 8 కార్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠాలోని కోటేష్, కనుకుల బేబీ పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం. జితేందర్‌రెడ్డి, ఎం. నాగభూషణ్, కె. కొండల్‌రెడ్డి, శాలిగౌరారం ఎస్‌ఐ, నార్కట్‌పల్లి సీఐ, పోలీస్ సిబ్బంది, సీసీఎస్ సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలు అందజేసి రివార్డు ప్రకటించారు.

ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాం


కల్నల్ లక్ష్మారెడ్డితో ఎంజీయూ విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: ఎన్‌సీసీ శిక్షణ తరగతుల్లో క్రమశిక్షణ, దేశభక్తి సమ్మిళితమైన ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తామని కల్నల్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడేట్ల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీలో ప్రవేశానికి 60 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వారిలో ఎత్తు, బరువు, ఆరోగ్యం, రాత పరీక్షల ఆధారంగా ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఇంజనీరింగ్ విద్య అభ్యసించే విద్యార్థులకు ఎన్‌సీసీ ద్వారా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, అగ్నివీర్ లాంటి పథకాల్లో అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జి డాక్టర్ మశ్చేందర్, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్.సుధారాణి, కొమ్ము మల్లయ్య, చంద్రవీర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


నిందితులను చూపుతున్న ఎస్‌ఐ

మోతె: మోతె మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకుల నుంచి 1.200 కేజీ గంజాయిని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండల కేంద్రానికి చెందిన యువకుడు, తన స్నేహితులతో కలిసి భద్రాచలం, ఒరిస్సా ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసి మోతె మండలానికి తీసుకొస్తుండగా.. ముందస్తు సమాచారం మేరకు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని రత్నాలకుంట ఇద్దరిని పట్టుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి 1.200 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

చివ్వెంల(సూర్యాపేట): కూకట్‌పల్లి కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాది శ్రీకాంత్‌పై కొందరు దుండగులు దాడి చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి సుంకరబోయిన రాజు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పవిత్ర మేడమ్ స్ఫూర్తితో..


విద్యార్థులకు కార్డ్ గేమ్స్, బోర్డు గేమ్స్ గురించి వివరిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర


డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు పవిత్ర

- టీచర్లు, లెక్చరర్లుగా పలువురి ఎంపిక
- జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లలో పాల్గొని సత్తాచాటుతున్న విద్యార్థులు

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మారం పవిత్ర జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డుకు ఎంపికయ్యారు. మారం పవిత్ర స్ఫూర్తితో ఆమె చదువు చెప్పిన ఎంతో మంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఆమె కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా.. తమలోని భయాలను తొలగించించేందుకు కృషిచేసేదని, చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు వారిలోని ఇతర ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేదని విద్యార్థులు చెబుతున్నారు.

జిల్లాస్థాయిలో గుర్తింపు లభించింది



పవిత్ర గైడెన్స్‌లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో వీడర్ అండ్ సీడర్ ప్రాజెక్టు ప్రదర్శించడంతో జిల్లా స్థాయిలో గుర్తింపు వచ్చింది. జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉంది.

– బి. శ్రీశాంత్, 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్

సంతోషంగా ఉంది



ఆంధ్ర, తెలంగాణ అగస్త్య జిజ్ఞాస పోటీల్లో మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో పాటు రూ.1500 ప్రైజ్‌మనీ పొందాను. జీవశాస్త్ర టీచర్ పవిత్ర మేడమ్ నన్ను ఎంతగానో ప్రోత్సహించింది.

– ఎం. మేఘన 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్

జిల్లా సైన్స్ ఫెయిర్‌లో అవార్డు దక్కింది



నేను తయారు చేసిన క్రాప్ ప్రొటెక్టర్ ఆఫ్ అన్‌సీజనల్ రెయిన్స్ ప్రాజెక్టుకు జిల్లా సైన్స్ ఫెయిర్‌లో అవార్డు దక్కడం ఆనందంగా ఉంది.

– శ్వేత 10వ తరగతి, పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్

బోధన తీరుతో స్ఫూర్తి పొందా..



సూర్యాపేటలోని ఎంఎస్ఆర్ బీఈడీ కళాశాలలో చదువుతున్నప్పుడు పవిత్ర మేడమ్ ప్రైవేట్ లెక్చరర్‌గా మాకు పాఠాలు బోధించేది. ఆమె బోధనా తీరు, ప్రేరణతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలనే లక్ష్యంతో కష్టపడి చదివి ఉద్యోగం టీచర్ ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం చండూరు మండలం దానుపాముల జెడ్పీహెచ్‌ఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాను.

– రాసమళ్ల సికిందర్, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, దానుపాముల, చండూరు

స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యా..



నేను గరిడేపల్లి మండలం గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి చదువుతున్నాను. పవిత్ర టీచర్ ఇచ్చిన శిక్షణతోనే నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాను. ప్రస్తుతం ప్రతి సంవత్సరం అకౌంట్‌లో రూ.12వేలు జమవుతున్నాయి. విద్యాభ్యాసం కోసం స్కాలర్‌షిప్ ఎంతగానో దోహదపడుతుంది.

– ఎ. వైష్ణవి, 10వ తరగతి, గడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్

ప్రాక్టికల్ విధానంలో బోధన చూసి..



మద్దిరాల మండలం గోరంట్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉన్నప్పుడు పవిత్ర టీచర్ ప్రాక్టికల్ విధానంలో సైన్స్ బోధించడం చూసి.. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ఇస్రోలో టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాను. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కులీ కుతుబ్‌షా పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. విద్యార్థులతో ఎలా ఉండాలనే విషయాన్ని పవిత్ర టీచర్ నుంచే నేర్చుకున్నాను.

– ప్రవీణ్‌కుమార్, పాలిటెక్నికల్ లెక్చరర్